గురువారం 20 జూలై 2023 నిర్మల్




బజార్‌హత్నూర్ రైతుసభలో పాల్గొన్న రైతులు

# కాంగ్రెస్ కుట్రలపై రైతన్న భగ్గు

## మూడు గంటల కరెంటు ఎట్ల సరిపోతదో చెప్పాలని ఆగ్రహం

- చెప్పకపోతే.. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- మీ చీకటి పాలన మాకొద్దంటూ ముక్తకంఠంతో నినదించిన కర్షకలోకం
- దుర్మార్గపు ఆలోచనలు చేస్తే ఊరి పొలిమేరల్లోకి కూడా రానియ్యం..
- రేవంత్‌రెడ్డిని కడిగిపారేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగం
- మూడో రోజూ రైతు వేదికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు


నస్పూర్ సీతారాంపల్లి రైతువేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల, జూలై 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలంటున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎట్లా చాలుతదో వివరించాలి. లేనిపక్షంలో యావత్ తెలంగాణ రైతులందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని రైతులు ముక్తకంఠంతో నినదించారు. రైతు వ్యతిరేకి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎక్కడ కనిపించినా తరమికొడుతామని హెచ్చరించారు. రైతులను చీకట్లోకి నెట్టాలని చూస్తున్న పార్టీని అంధకారంలోకి నెట్టేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు మూడో రోజైన గురువారం ఉమ్మడి జిల్లాలో రైతుసభలను నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో పరాయి పాలనలో కరెంట్ ఎప్పుడు వచ్చేదో.. ఎప్పుడు పోయేదో తెలిసేది కాదని.. రాత్రి, పగలు తేడా లేకుండా కరెంట్ కోసం కాపలాకాసిన ఆ చీకటి రోజులను గుర్తుకు చేసుకునే ధైర్యం కూడా తాము చేయలేమని రైతులు వాపోయారు. ఈ దుర్మార్గపు ఆలోచన చేసిన కాంగ్రెస్ పార్టీని ఊర్లలోకి రానివ్వకుండా తరిమికొట్టాలని.. మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ మాకు వద్దు.. మూడు పంటలకు కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్ కావాలంటూ తీర్మానాలు చేశారు.

### వేలాదిగా తరలివచ్చిన రైతులు.. ప్రముఖుల హాజరు..

నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలో నిర్వహించిన రైతు సభకు అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో రైతులు పచ్చబడుతుంటే చూసి కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతున్నదన్నారు. రైతులపై కాల్పులు జరిపిన చంద్రబాబుతో కలిసి తెలంగాణను వ్యతిరేకించిన ద్రోహి రేవంత్‌రెడ్డి.. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అనంతరం రైతులు చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. మంచిర్యాల నియోజకవర్గంలోని నస్పూర్ సీతారాంపల్లి, దండేపల్లి, లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ రైతువేదికల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దివాకర్‌రావు, బెల్లంపల్లి నియోజవకర్గంలోని నెన్నెల మండలంలో గల చిత్తాపూర్, గురిజాల మండల రైతువేదికల్లో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఖానాపూర్ నియోజకవర్గం దస్తురాబాద్‌లో ఎమ్మెల్యే రేఖాశ్యాంనాయక్, బోథ్ నియోజకవర్గం బజార్‌హత్నూర్‌లో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, ఆసిఫాబాద్ నియోజకవర్గం లింగాపూర్‌లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు రైతు సభల్లో పాల్గొన్నారు. రైతులు వేలాదిగా తరలివచ్చి సభల్లో పాల్గొన్నారు.


బజార్‌హత్నూర్ రైతు వేదికలో సమావేశానికి హాజరైన రైతులు


తాళ్లగురిజాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య


దస్తురాబాద్ రైతువేదికలో..


ఇంద్రవెల్లి : కెస్లాగూడ శివారంలోని పత్తి చేనులో నిలచిన వర్షపు నీరు


బోథ్ : రాంనగర్ వద్ద కల్వర్టుపై నుంచి పారుతున్న వరద


ఇంద్రవెల్లి : మత్తడి దుంకుతున్న అంజీ చెక్‌డ్యాం


ఆదిలాబాద్ జిల్లాలోని పొచ్చెర జలపాతం వద్ద వరద తాకిడి


బజార్‌హత్నూర్ : కనకాయ జలపాతానికి వచ్చిన చేరిన వరదనీరు


కడెం : కడెం ప్రాజెక్టులోకి చేరిన నీరు

# గెరువియ్యలే..

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా మోస్తరు వాన

- ఆదిలాబాద్‌లో అత్యధికంగా 53.9 మిల్లీమీటర్లు
- మంచిర్యాలలో అల్పంగా 15.7 మిల్లీమీటర్లు
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- మత్తడి దుంకుతున్న చెరువులు
- జలాశయాలకు జలకళ .. సాగుకు ప్రయోజనం..



ఇచ్చోడ : లచ్చింపూర్(కే) గ్రామంలో కూలిన ఇల్లు


తాంసి : వడ్డాడి శివారులో పొలాల్లో వర్షపు నీరు

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, జూలై 19 ( నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. నిరంతరంగా కురుస్తున్న వర్షానికి జనాలు ఇండ్లు వదిలి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జలపాతాలు నీటితో కళకళలాడుతున్నాయి. ప్రాజెక్టులు, చెరువుల్లోకి వరద నీరు చేరుతోంది. ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం వరకు సగటున అత్యధికంగా 53.9 మిల్లీమీటర్ల వర్షం కురియగా, నిర్మల్‌లో 52.3, ఆసిఫాబాద్‌లో 35.2, మంచిర్యాలలో 15.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆదిలాబాద్ జిల్లాలో తాంసిలో 71.3, ఆదిలాబాద్ అర్బన్‌లో 68.2, ఇంద్రవెల్లిలో 64.4, జైనథ్‌లో 63.5, ఉట్నూర్‌లో 63.2 మిల్లీమీటర్లు నమోదైంది. నిర్మల్ జిల్లాలోని కుంటాలలో 67.6, కుభీర్ 65.1, ముథోల్ 63.9, నిర్మల్ 81.9, తానూర్‌లో 61.8 మిల్లీమీటర్లు కురిసింది. ఆసిఫాబాద్ జిల్లాలో అత్యధికంగా సిర్పూర్(యూ) 69.5, జైనూర్‌లో 67.5, లింగాపూర్‌లో 52.6 మిల్లీమీటర్లు పడింది. మంచిర్యాల జిల్లాలో పెద్దగా వర్షం లేదు. జన్నారంలో 48.9, దండేపల్లిలో 25.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

### భారీగా వరద..

భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో వడ్డాది మత్తడి వాగు ప్రాజెక్ట్ నిండుకుండను తలపిస్తున్నది. ఇంద్రవెల్లి మండలంలోని అంజీ చెక్ డ్యాం కట్ట మీద నుంచి వరద నీరు పోతోంది. భారీ వర్షాలకు తాంసి మండలంలో పొన్నారి అంతర్రాష్ట్ర రహదారిపై నుంచి వరద పారుతోంది. ఉట్నూర్ మండలంలో పలు చోట్ల పొలాలు నీటిలో మునిగాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండలంలో గల చింతల మాదారం జలపాతం జలకళను సంతరించుకున్నది. చింతలమానేపల్లి మండలంలో దిందా-కేతిని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా, లింగాపూర్ మండలం పట్కల్ మంగి గ్రామ సమీపంలోని బ్రిడ్జిపై నుంచి వాగు ఉప్పొంగుతున్నది. నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాల్లో చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. కొంచెం ఆలస్యమైనా వర్షాలు పడుతుండడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరి, పత్తి విత్తనాలు వేసిన రైతులకు ఈ వర్షాలు మేలు చేస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.


ఇచ్చోడ : గాయత్రి జలపాతం


బోథ్ : కౌఠ (బీ)లో పత్తి చేనులో నిలిచిన నీరు


సిర్పూర్(యు) : సిర్పూర్(యు)-దేవుడ్‌పల్లి వెళ్లే వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద


చింతలమానేపల్లి : ఉధృతంగా ప్రవహిస్తున్న దిందా-కేతిని వాగు

# అల్లరి

ALLARI

### చెప్పుకోండి



1. భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ ఎక్కడ ఉన్నది?
2. ఫలక్‌నుమా ప్యాలెస్‌ను నిర్మించింది ఎవరు?
3. స్టెతస్కోప్‌ను కనుగొన్నది ఎవరు?

### పదసృష్టి




కింద ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Father

Ex : Teeth

# నిజాయతీ

కథ



ఊరి బయట వేపచెట్టు కింద కూర్చుని బిచ్చమెత్తి తెచ్చుకున్న అన్నం తింటున్నాడు రంగయ్య. ఏదో ఆలోచిస్తూ తింటున్న అతని నోటికి ఏదో గట్టిగా తగిలింది. తీసి చూస్తే బంగారు ఉంగరం! 'ఇది నా జోలెలోకి ఎలా వచ్చింది?' అని తెగ ఆలోచించాడు. 'ఎవరో తల్లి కబళం వేసేటప్పుడు ఆమె చేతి ఉంగరం జారి జోలెలో పడినట్టుంది. ఇది ఎవరిదైతే వారికి ఇచ్చేయాలి. ధర్మం చేసిన వారికి నేను అధర్మం చేయకూడదు!' అనుకున్నాడు. కానీ, ఎవరికి ఇవ్వాలి? ఒక ఇంట్లో భిక్షమైతే గుర్తుపట్టవచ్చు. ఇవాళ పది ఇళ్లలో అన్నం అడుక్కున్నాడు. వాళ్లలో ఏ ఇల్లాలిదై ఉంటుంది? పోనీ ఊరిపెద్ద చలమయ్యకు ఇస్తే.. అసలువాళ్లకు చేర్చమని. కానీ, అతను పెద్ద అవినీతిపరుడు. తనే జేబులో వేసుకుంటాడు. తర్వాత తను వెళ్లి అడిగితే.. 'నువ్వు నాకు ఉంగరం ఇవ్వడం ఏంట్రా?' అని తన్ని తరిమేస్తాడు. జనం కూడా బిచ్చగాడి మాటలు నమ్మరు కదా? మరి ఎలా? తొందరపడకూడదు. జాగ్రత్తగా ఆలోచించి అసలు యజమానురాలికి దీన్ని చేర్చాలి అని ఆలోచించాడు. మర్నాడు బిచ్చానికి వెళ్లినప్పుడు ఆ ఇల్లాళ్ల ముఖ కవళికలు పరిశీలించడం మొదలుపెట్టాడు. వారి కుడి చేతివేళ్లను కూడా గమనించాడు. తొమ్మిది ఇళ్లలోని వారు ఎప్పటిలాగే చిర్రుబుర్రులాడుతూ ఎలాంటి విచారం లేకుండా భిక్షం వేశారు. కానీ, పదో ఇంటి ఇల్లాలు లక్ష్మీ రమణమ్మను భిక్షం వేస్తున్నప్పుడు పరిశీలనగా చూశాడు. ఆమె దిగులుగా ఉన్నట్టు అర్థమైంది. ఆవిడ కుడిచేతిని చూస్తే ఉంగరం లేదు కానీ, అది ఉండేదన్నట్టు వేలికి అచ్చు ఉంది. దాంతో తన జోలెలో పడిన ఉంగరం ఆమెదే అని తీర్మానించుకున్నాడు. లక్ష్మీరమణమ్మ భిక్షం వేసి లోపలికి పోబోతుండగా.. ''అమ్మగారూ!'' అని పిలిచాడు. ఆవిడ ఏంటన్నట్టు వెనుతిరిగి చూసింది. అప్పుడు తన చింకిపాతలో దాచిన ఉంగరాన్ని బయటికి తీసి, అరచేతిలో పెట్టుకుని ఆమెకు చూపి.. ''ఇది మీదే కదా అమ్మగారు?'' అని అడిగాడు. ఆవిడ కళ్లు ఆనందంగా మెరిశాయి. ''అవును బాబూ నాదే! నీకు ఎక్కడ దొరికింది?'' అన్నది ఆశ్చర్యంగా. ''నిన్న మీరు భిక్షం వేసేటప్పుడు నా జోలిలో పడిందమ్మా.. ఎవరిదా? అని ఆలోచించి ఆలోచించి బుర్ర వేడెక్కిపోయింది. అందుకనే ఇవాళ అన్నం వేసే అమ్మలందరినీ పరిశీలనగా చూశాను. వాళ్ల చేతివేళ్లు కూడా పరిశీలించాను. మీ ముఖంలో ఎప్పటిలా సంతోషం లేదు. పైగా దిగులు! మీ వేలికి ఉంగరం హద్దు ఉంది గానీ, ఉంగరం లేదు. అందుకే మీదేనని పోల్చుకున్నాను'' అన్నాడు ఉంగరం ఆమె చేతిలో పెడుతూ. ''అవును బాబు ఇది నాదే! ఇది పోయిందని రాత్రంతా నిద్ర లేదు. తిండి లేదు. నీ గొప్ప గుణానికి రెండు చేతులెత్తి మొక్కుతున్నాను. పేదవాడివైనా ఖరీదైన ఉంగరాన్ని తిరిగి తెచ్చిచ్చావు. నువ్వు నిజంగా గొప్పవాడివి బాబు'' అంటూ ఆనందబాష్పాలు రాల్చిందామె. ''మీలాంటి ధర్మ తల్లులకు దేవుడు ఎప్పుడూ అన్యాయం చేయడమ్మా!'' అని వెనుతిరిగి వెళ్లిపోయాడు రంగయ్య. వెళ్లిపోతున్న రంగయ్య ఆమెకు బిచ్చగాడిలా కాక.. సాక్షాత్తూ దేవుడిలా కనిపించాడు. మరోసారి అతనికి మొక్కి ఇంట్లోకి వెళ్లిపోయింది లక్ష్మీ రమణమ్మ.

నీతి : పేదవాడైనా.. ధనవంతుడైనా నిజాయతీ అవసరం.

• చంద్రప్రతాప్ కంతేటి

### పెద్దల మాట




కాంతి ఏ దీపం నుంచి వచ్చినా మంచిదే! గులాబీ ఏ తోటలో విరిసినా అందంగానే ఉంటుంది.

• సర్వేపల్లి రాధాకృష్ణన్


### ఐదు నదుల నేల


పంజాబ్ పేరుతో మనదేశంలోనే కాదు పాకిస్తాన్‌లోనూ ఓ రాష్ట్రం ఉంది. మనది తూర్పు పంజాబ్, పాకిస్తాన్‌లోది పశ్చిమ పంజాబ్. ఈ పదం రెండు వేర్వేరు పదాల కలయికగా ఏర్పడింది. పర్షియా (ఇప్పటి ఇరాన్) భాషలో 'పంజ్' అంటే ఐదు, 'అబ్' అంటే నీళ్లు అని అర్థం. ఐదు నదుల




నీళ్లు ప్రవహించే నేల అనే అర్థంలో పంజాబ్‌కు ఆ పేరు వచ్చింది. పూర్వం గ్రీకులు ఈ ప్రాంతాన్ని పెంటాపొటేమియా (పెంటా- ఐదు, పొటేమియా- నదుల ప్రాంతం) అని పిలిచారు. ఆ ఐదు నదులు ఏవంటే..? జీలం, చినాబ్, రావి, సట్లెజ్, బియాస్. ఇవన్నీ పాకిస్తాన్‌లో మరో పెద్ద నది అయిన సింధు నదిలో కలుస్తాయి. ఈ నదులు తీసుకువచ్చిన ఒండ్రుమట్టి వల్ల పంజాబ్ ప్రాంతం ఎంతో సారవంతంగా ఉంటుంది. పంటలు బాగా పండుతాయి.

### ఆ పదమేంటి?



జవాబులు

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com